

# సూర్య

నేటి దినపత్రిక


www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

సోమవారం,9 మార్చి 2026 | 8 పేజీలు


# కాకినాడలో 'డ్రగ్' డైనోసార్ల దందా




## నిజాయితీ గల అధికారిణిపై 'అక్రమ' వేట!

## సామాన్యుడి ఆరోగ్యంపై వికృత చదరంగం.. కోట్లలో మందుల వ్యాపారం!







**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

పెన్షనర్స్ ప్యారడైజ్‌గా పిలవబడే కాకినాడ నగరం, ఇప్పుడు మెడికల్ మాఫియాకు కాసుల కురిపించే గనిగా మారింది. నగరంలోని సుమారు 80 వేల కుటుంబాలు, ప్రతి ఇంట్లోనూ అనారోగ్య కారణాలతో నెలకు సగటున రూ. 2,000 నుంచి రూ. 5,000 వరకు మందుల కోసం ఖర్చు చేస్తున్నాయి. అంటే, నెలకు కొన్ని పదుల కోట్ల రూపాయల మందుల వ్యాపారం ఇక్కడ సాగుతోంది. ఇంతటి భారీ ఆర్థిక నెట్‌వర్క్ ఉండబట్టే, ఈ వ్యవస్థలోకి డైనోసార్ల వంటి మాఫియా శక్తులు ప్రవేశించాయి. నగరం చుట్టూ ఉన్న 800 మెడికల్ షాపుల్లో సుమారు 400 షాపులు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తూ, అక్రమ సంపాదనకు అలవాటు పడ్డాయి. ఈ అక్రమార్కులందరికీ 'మెడికల్ అసోసియేషన్' ఒక రక్షణ గొడుగులా మారింది.

**అసోసియేషన్ ముసుగులో 'వసూళ్ల రాజ్యాంగం'**

తమ అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు ఈ 400 షాపుల యజమానులు అసోసియేషన్ పేరుతో ఒక వ్యూహాన్ని రచించారు. ఒక్కో షాపు నుంచి నెలకు రూ. 5,000 నుంచి రూ. 10,000 వరకు 'నెలవారీ కప్పం'

- తరువాయి 2లో..

## అత్యంత వైభవంగా ద్రాక్షారామం నూతన మార్కెట్ యార్డ్ కమిటీ

# ప్రమాణ స్వీకార మహోత్సవం

- అన్నదాతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి వాసంశెట్టి సుభాష్

- 2026-27 బడ్జెట్లో వ్యవసాయ రంగానికి రూ.53 వేల కోట్లు - రైతులకు పలు సంక్షేమ పథకాలు : మంత్రి సుభాష్







**ద్రాక్షారామం,మేజర్‌న్యూస్** : దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆదివారం ద్రాక్షారామం మార్కెట్‌యార్డ్ కమిటీ నూతనపాలక మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం అత్యంత వైభవంగాజరిగింది. మార్కెట్‌యార్డ్ ప్రాంగణంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. 2026-27 బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ. 53వేల కోట్లు కేటాయించడం రైతులపట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు.

**రైతులకు ఆర్థిక భరోసా - పలు పథకాలు:** రైతులకు సాగు ఖర్చులకు అవసరమైన ఆర్థికసాయం అందించేందుకు అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యాంత్రీకరణ, పీఎం కిసాన్ సమ్మాన్

- తరువాయి 2లో..

# కాకినాడలో 'డ్రగ్' డైనోసార్ల దందా

మొదటిపేజి తరువాయి

వసూలు చేస్తూ, ఆభారీ సొమ్ముతో వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారు. గతంలో ఉదయభాస్కర్ అనే డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నిలదీస్తే, రాజకీయ అండతో ఆయనను ఇక్కడి నుండి పంపించిన చరిత్ర ఈ మాఫియాకు ఉంది. "నిజాయితీ గల అధికారికి ఇక్కడ చోటు లేదు" అనే అహంకారంతో వీరు రాజ్యమేలుతున్నారు.

**వైట్ కోటు చాటున 'నల్ల' దందా –**

**– ఫార్మసిస్ట్ లేని మారణకాండ:** చట్ట ప్రకారం ఉండాల్సిన ఫార్మసిస్ట్ లేకుండానే మందుల పంపిణీ జరుగుతోంది. అవగాహన లేని వ్యక్తులు ఇచ్చే తప్పుడు మాత్రలవల్ల రోగుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

**– నార్కోటిక్స్ విక్రయం:** యువతను మత్తుకు బానిసలను చేస్తూ, అత్యంత ప్రమాదకరమైన నార్కోటిక్ మందులను బ్లాక్ మార్కెట్‌లో భారీ ధరలకు విక్రయిస్తున్నారు.

**– అబార్షన్ కిట్ల దందా:** గైనకాలజిస్టుల పర్యవేక్షణ లేకుండా, అబార్షన్ కిట్లను చాక్లెట్లలా విక్రయిస్తూ మహిళల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

**– జీఎస్టీ మాయాజాలం:** పాత ఎమ్మార్పీ ధరలకే మందులు అమ్ముతూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ వినియోగదారులను నిలువునా దోచుకుంటున్నారు.

**పర్వీన్ సుల్తానా రాక – మాఫియా పునాదులు కదిలాయి!**

జూన్ 2025లో కర్నూల్ నుండి బదిలీపై వచ్చిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ పర్వీన్ సుల్తానా, ఈ అక్రమ సామ్రాజ్యం గుమ్మం తొక్కగానే షాక్ ఇచ్చారు. అసోసియేషన్ ప్రతినిధులు బేరసారాలకు వెళ్లగా, ఆమె వారిని గడ్డిపోచలా తిరస్కరించారు."నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు" అని తేల్చిచెప్పారు. ఆమె చేసిన ఆకస్మిక తనిఖీల్లో నార్కోటిక్స్ విక్రయాలు బయటపడటంతో, షాపులకు సీళ్లు వేసి క్లోజర్ ఆర్డర్లు ఇచ్చారు. దీంతో మాఫియా ఉనికికే ముప్పు ఏర్పడింది.

**కుట్రల పర్వం – నిజాయితీపై నిందల బురద!**..ఆమెను ఇక్కడి నుండి పంపించడానికి మాఫియా ఒక నీచమైన వ్యూహం రచించింది.

**– ఎంపీకి తప్పుడు సమాచారం:** ప్రభుత్వ హాస్పిటల్ ఆవరణలోని జనరిక్ షాప్ వద్ద ఆమె రూ. 1.20 లక్షలు వసూలు చేసినట్లు తప్పుడు కథనాలు అల్లి స్థానిక ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అసలు జనరిక్ షాపులు ఇన్స్పెక్షన్ చేయలేనట్టుగా తెలుస్తోంది.

**– నిందల పర్వం:** అనారోగ్యంతో ఉన్న ఒక మహిళా అధికారిణిపై కుట్రలు పన్నడం, రాత్రికి రాత్రే సమావేశాలు పెట్టి ధర్నాలు, ర్యాలీలు నిర్వహించడం ద్వారా తమ అవినీతిని కప్పిపుచ్చుకోవాలని చూస్తున్నారు.

**ఫిర్యాదులు – కలెక్టర్ కోర్టులో బంతి!**

అక్రమాలను అడ్డుకుంటున్న అధికారిణిని నైతికంగా దెబ్బతీయడానికి మాఫియా తనచివరి అస్త్రాన్ని ప్రయోగించింది.తమ షాపులను మూసివేసి, కేసులు పెట్టివేధిస్తున్నారని,అలాగే భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

**– విచారణాధికారిగా జె.సి:** ఈ ఫిర్యాదుల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్, దీనిపై సమగ్ర విచారణ జరపాల్సిందిగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌ని ఆదేశించారు.

**– ముఖాముఖి విచారణ:** శనివారం నాడు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ పర్వీన్ సుల్తానాను స్వయంగా రప్పించి జె.సి విచారణ చేపట్టారు. ప్రస్తుతం ఈ విచారణ కొనసాగుతోంది.

**ప్రజల డిమాండ్ – నిజాయితీ గెలవాలి!**

కాకినాడ నగర ప్రజలు,ముఖ్యంగా నిరుపేద రోగులు ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు. వారి ఆవేదన మరియు డిమాండ్ ఒక్కటే:

**– మాఫియాను వదలొద్దు:** అత్యవసరమైన మందులను ఒక 'డైనోసార్' నీడలో ఉంచి, చీకటి సామ్రాజ్యాన్ని నడుపుతూ సామాన్యుడి రక్తాన్ని పిండుతున్న అక్రమార్కులను ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టకూడదు.

**– అధికారిణిని భరోసా కల్పించాలి:**

నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న పర్వీన్ సుల్తానాను ఇక్కడే డ్రగ్ ఇన్స్పెక్టర్‌గా కొనసాగిస్తూ అండగా భరోసా కల్పించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

**– ప్రక్షాళన జరగాలి:** ఆమె ఉంటేనే ఈ మాఫియాను కోకటివేళ్లతో పెకిలించే అవకాశం ఉంటుందని, అప్పుడే అందరూ దారిలోకి వచ్చి నిజాయితీగా వ్యాపారం చేసే వాతావరణం కాకినాడలో వస్తుందని రోగులు ఆశిస్తున్నారు.

**అధికారుల చేతుల్లోనే...**నిజాయితీ గల అధికారిణిపై జరుగుతున్న ఈ 'అక్రమ వేట'లో అంతిమంగా ధర్మం గెలుస్తుందా? లేక డైనోసార్ మాఫియా తన పట్టు బిగిస్తుందా? అన్నది జిల్లా యంత్రాంగం తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉంది.కాకినాడ నగర స్మార్ట్ సిటీ ప్రజల ఆరోగ్యం మరియు భవిష్యత్తు ఇప్పుడు అధికారుల చేతుల్లోనే ఉంది.

## కోడిపందాలపై పోలీసులు దాడి

**– 6 గురు అరెస్ట్, రూ.5500లు, 2 కోడి పుంజులు స్వాధీనం**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని పులిదిండి మరియు వెలిచేరు గ్రామం శివారులో శనివారం అర్ధరాత్రి కోడిపందాలు జరుగుతున్నాయని సమాచారంపై ఎస్ఐ ఎస్.రాము, సిబ్బంది కలసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో కోడిపందాలు వాడుతున్న 6 మంది వ్యక్తులను పట్టుకుని వారి వద్దనుండి రూ.5500 నగదు, 2 కోడిపుంజులను స్వాధీన పరుచుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.రాము తెలిపారు.

## టీడీపీ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**భీమడోలుమేజర్ న్యూస్ :**స్థానిక టీడీపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏపీ ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గానికి చెందిన కూటమి పార్టీల మహిళానేతలు పాల్గొనగా, వారిని గన్ని దుస్సాలువాలతో సత్కరించి, చీరలు పంపిణీ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా గన్ని మాట్లాడుతూ మహిళలు నేటి సమాజంలో అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని, కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగాలు, వ్యాపారాలు, రాజకీయాల్లో కూడా మహిళలు ప్రతిభ చూపుతున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో అసెంబ్లీ, స్థానిక సంస్థలు, పంచాయతీలలో మహిళలకు మరింత అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల సాధికారతే సమాజ అభివృద్ధికి పునాది అని ఆయన పేర్కొన్నారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండల గ్రామాలకు చెందిన మహిళా నేతలు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా ద్రాక్షారామం నూతన మార్కెట్ యార్డ్ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం







మొదటిపేజి తరువాయి

నిధివంటి పథకాల ద్వారా సహాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో అన్నదాతలను పూర్తిగాగాలికి వదిలేశారని మంత్రి విమర్శించారు. రైతులకు మేలు చేసే విధంగా కూటమి ప్రభుత్వం సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మరో 15 ఏళ్లపాటు కూటమి పాలన సాగాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కూటమి అధినేతలు కోరుకుంటున్నారన్నారు. వారి అభీష్టం మేరకు కూటమి నాయకులు ఐక్యతతో ముందుకు సాగుతామన్నారు. ఏఎంసీ నూతన చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ, పార్టీ కోసం చేసిన తనకష్టాన్ని గుర్తించి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, మంత్రి వాసంశెట్టి సుభాష్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యంలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తూ, అన్నదాతలకు అండగా నిలుస్తామని, నియోజకవర్గంలో పుంత రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్, పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చిన్న వయసు నుంచే నాయకత్వ లక్షణాలు అలవరచుకుని క్రమశిక్షణతో ఈ స్థాయికి ఎదిగిన రిశ్వంత్ రాయ్‌ను అభినందించారు.పార్టీ అధికారంలో లేని సమయంలో పార్టీకి అండగా ఉండి వెంట నడిచిన అక్కలకు అధిష్టానం న్యాయం చేసిందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆక్వా రంగానికి ప్రోత్సాహం, రైతులకు గిట్టుబాటు ధర, సాగునీటి సమస్యలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసి రైతులకు మేలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు.

తెదేపా సీనియర్ నాయకులు మోకా ఆనంద సాగర్, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావులు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

**నూతన కమిటీ ప్రమాణ స్వీకారం:** ద్రాక్షారామం మార్కెట్ యార్డ్ కమిటీ గౌరవ అధ్యక్షులుగా రామచంద్రపురం శాసనసభ్యులు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఏఎంసీ చైర్మన్‌గా అక్కల రిశ్వంత్ రాయ్, వైస్ చైర్మన్‌గా దడాల నాగేశ్వరి నాగార్జున, పాలకమండలి సభ్యులుగా కేసనకుర్తి వెంకటేశ్వరరావు, ఖండవల్లి శ్రీనివాసరావు, వక్కు ద్రాక్షాయని అర్జున్ రావు, పీలుక లక్ష్మీ భార్గవి రాఘవేంద్రరావు, సలాది పుష్పవతి, గుండారపు నాగమణి శ్రీనివాసరావు, మేడిశెట్టి విజయభాస్కర్, మేకల లక్ష్మి, గున్నం వినోద్ కుమార్, జగ్గంపూడి గనిరాజు, మరివాడ చిన కృష్ణయ్య, నారపురెడ్డి బలరాం, రెడ్డి శేషగిరిరావులు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు, శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకె అన్నపూర్ణ,రామచంద్రపురం నియోజకవర్గంలోని మండలాల తెదేపా, జనసేన,బిజెపిఅధ్యక్షులు,ఏఎంసీ డైరెక్టర్లు, పెద్ద ఎత్తున కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**భారీ ఊరేగింపు..కదలి వచ్చిన కూటమి నాయకులు**

ప్రమాణ స్వీకారానికి ముందు మంత్రి వాసంశెట్టి సుభాష్ గృహం నుంచి భారీ ఊరేగింపుతో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు బయలుదేరారు. మంత్రి సుభాష్‌తో పాటు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, డైరెక్టర్లను మేళతాళాలతో.. అడుగడుగునా హారతులు పడుతూ.. పూలమాలలు వేస్తూ ద్రాక్షారామం సభ ప్రాంగణానికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో కూటమి శ్రేణులు తరలి రావడంతో రామచంద్రపురం, ద్రాక్షారామాల్లో సందడి నెలకొంది.

# మహిళల సాధికారతే సమాజ పురోగతికి మూలాధారం





**– కూటమి పాలనలో మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యత**

**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** మహిళలు శక్తి స్వరూపాలని, సృష్టికి మూలం మహిళలేనని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రావులపాలెం కాపు కళ్యాణ మండపంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన డిఎల్ డిఓ రాజేశ్వరరావు, అనపర్తి తెదేపా ఇంచార్జ్ ఆకుల రామకృష్ణ, యువ నాయకులు బండారు సంజీవ్ లతో కలిసి పాల్గొన్నారు. ముందుగా సమావేశానికి వచ్చినవారందరికీ ఎమ్మెల్యే, నాయకులు సాదరంగా ఆహ్వానం పలికారు. మహిళా రైతులు ఏర్పాటు చేసిన సేంద్రియ ఉత్పత్తులను ఎమ్మెల్యే పరిశీలించారు. చిన్నారులతో ఎమ్మెల్యే బండారు ఆత్మీయంగా సంభాషించారు. అనంతరం నియోజకవర్గంలో నాలుగు మండలాలకు చెందిన వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతూ విజయపథంలో నడుస్తున్న 10 మంది మహిళలకు సత్కారం నిర్వహించారు. మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. మహిళా పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. మహిళా ఇన్‌ఫ్లూయెన్సర్లతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలను గుర్తించి గౌరవించుకోవడమే మహిళా దినోత్సవం యొక్క ప్రధాన ఉద్దేశమన్నారు. పని గంటలు, వేతనాలపై మహిళా వస్త్ర కార్మికులు 1908లో న్యూయార్క్ వీధుల్లో మొదలు పెట్టిన ప్రదర్శన ఆ తర్వాత మహిళా విప్లవానికి దారితీసిందని, ఐక్యరాజ్యసమితి 1975లో మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని అధికారికంగా గుర్తించిందని తెలిపారు. భారతీయ సంప్రదాయంలో మహిళలకు మొదటి నుంచి సముచిత స్థానం ఉందన్నారు. స్వాతంత్ర పోరాటంలో సైతం ఝాన్సీ లక్ష్మీబాయి, దుర్గాబాయి దేశ్ ముఖ్, సరోజినీ నాయుడు వంటి ఎంతోమంది మహిళలు పోరాటం చేశారని గుర్తు చేశారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుకు దూసుకుపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అన్నారు.

స్త్రీ శక్తి పథకంతో మహిళలకు ఉచిత బస్సు అమలు చేస్తుందని, తల్లికి వందనం పథకంతో చదువుకునే విద్యార్థులందరికీ రూ.13వేల చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి డ్వాక్రా సంఘాల ద్వారా ఎమ్ఎస్ఎమ్ఈ యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. మహిళలంటే కూటమి ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీకి ఎంతో గౌరవం అన్నారు. అన్న ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చాక మహిళలకు ఆస్తిలో సమాన వాటా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. డ్వాక్రా సంఘాల అభివృద్ధితో మహిళల స్వయం సమృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేశారని తెలిపారు. మహిళలంతా ఐక్యమత్యంతో ముందుకు సాగినప్పుడు సమాజం పురోభివృద్ధి చెందుతుందని దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఈ సంవత్సర కాలంలో నియోజకవర్గ నాలుగు మండలాలకు సంబందించిన ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీ నిధి, ఉన్నతి సంబంధించిన మెగా చెక్కును వారికి అందజేశారు.ఎంఎస్ఎంఈ ద్వారా మహిళలు వివిధ వృత్తి వ్యాపారాలు చేసుకునేందుకు ముందుకు రావాలని, ఈ ఏడాదిలోనే 100 మంది మహిళామణులతో వ్యాపారాలు పెట్టుకునేందుకు ప్రోత్సాహకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని. దీనిని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకుని వారి వారి వృత్తి నైపుణ్యాలను వ్యాపారాలకు తీసుకునే విధంగా ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం సమావేశానికి వచ్చిన మహిళామణులందరికీ ఎమ్మెల్యే బండారు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. స్వయంగా ఎమ్మెల్యే భోజనాలు వడ్డించారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమం



ఎటపాక, మేజర్ న్యూస్ : పోలవరం జిల్లా ఎటపాక మండలం నందిగామ గ్రామంలో తెలుగుదేశం పార్టీ మహిళా విభాగ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ ఎటపాక మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య, క్లస్టర్ ఇంచార్జ్ వల్లభనేని చందు, మండల ప్రధాన కార్యదర్శి కణితి మధు ముఖ్య అతిధులుగా పాల్గొని మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని విభిన్న రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ కుటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ సామాజిక, రాజకీయ ఆర్థిక సాంకేతిక రంగాల్లో సమాన అవకాశాలను సాధిస్తూ ఎన్నో సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్న ప్రతి స్త్రీమూర్తికి నమస్కారాలు, సమాజ మార్పులో కీలక పాత్ర పోషిస్తూ నాయకత్వం, నిబద్ధత, సేవాభావంతో భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్న అంతర్జాతీయ మహిళా శక్తికి అంతర్జాతీయ మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం మహిళలను ఆదుకోవడంలో అన్ని విషయాలలో ముందుందని స్త్రీ శక్తి పథకం మరియు తల్లికి వందనం దీపం పథకంతో ఉచిత గ్యాస్ అందిస్తూ ఇటువంటి ఎన్నో గొప్ప సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రభుత్వం మహిళలను అన్ని రంగాలలో ప్రోత్సహిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షులు పుట్టి రమేష్ బాబు,సీనియర్ నాయకులు పెనుబల్లి సాయి, ఐటీడీపీ నాయకులు బాచినేని శ్రీకాంత్, ఎంపీటీసీ పాయం దేవి, మాజీ ఎంపీపీ పోడియం శ్యామలత, మండల మహిళా నాయకులు టేకుమల్ల రూపలక్ష్మి, పునుగుపాటి స్రవంతి, బోడ సీత, నిమ్మల రాజమ్మ, తనుజ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం గ్రామంలో వేంచేసియున్న పురాతన ఆలయం శ్రీ రాజరాజేశ్వరి వేణుగోపాలస్వామివారి ఆలయ పునఃనిర్మాణానికి ఆదివారం గ్రామానికి చెందిన సాగిరాజు సోమరాజు, సత్యవతమ్మ తరుపున వారి కుమారుడు రామాంజనేయరాజు రూ.5 లక్షలు విరాళాన్ని వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదనూరి వెంకట రాజు, ఆలయ చైర్మన్లు వేగేశ్న ప్రసాద్ రాజు, పులవర్తి కాశీ విశ్వనాథం లకు అందజేశారు. ఐదు కోట్లతో నిర్మించనున్న ఈ ఆలయ నిర్మాణానికి ఇప్పటివరకు కోటి రూపాయల వరకు విరాళాలుగా సమకూరింది.

## క్యాన్సర్‌ని ఆదిలోనే గుర్తిస్తే వ్యాధి నయం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** క్యాన్సర్ వంటి వ్యాధులను ముందగానే గుర్తిస్తే నయం చేయడం సాధ్యమని రాజమహేంద్రవరం జీఎస్ఎసల్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యనిపుణులు (అంకాల్టిస్ట్) డాక్టర్ కె.సింధూష అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దేవతిలకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వాడపల్లి బీఎస్ఎన్ పంక్షన్ హాల్లో ఏర్పాటైన మహిళల ఆరోగ్యంపై ఆమె అవగాహన కల్పించారు. మహిళల్లో ఎక్కువగా కనిపిస్తున్న బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ గురించి మాట్లాడుతూ ఈ వ్యాధి గురించి ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు (బ్రెస్ట్ సెల్ఫ్ ఎగ్జామినేషన్, మామోగ్రఫీ, పాప్ స్మియర్) చేయుంచుకోవడం, హెచ్‌పివి వ్యాక్సిన్ వేయించుకోవడం చాలా ముఖ్యమన్నారు. అనంతరం నిర్వాహకులు ఆమెను ఘనంగా సత్కరించారు.

# సాంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వెయ్యాలి





– రామకృష్ణంరాజు ఇంట ఉపనయన వేడుక

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : ఆత్రేయపురం గ్రామానికి చెందిన సాగిరాజు రామకృష్ణంరాజు ఇంట కుమారుడు సూర్య తేజ ఉపనయన మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మండలంలోని గ్రామాలకు చెందిన నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొని ఆశీర్వదించారు. గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ సాంస్కృతి సాంప్రదాయాలకు పెద్ద పీట వేస్తున్నారని పలువురు అన్నారు.

ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు చెర్ల జగ్గిరెడ్డి, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, యువ నాయకులు బండారు సంజీవ్, అమలాపురం వైసీపీ ఇన్చార్జ్ పినిపే శ్రీకాంత్, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసం పూడి రామకృష్ణంరాజు, సొసైటీ అధ్యక్షులు ముదునూరి రాంబద్ర రాజు, మాజీ ఎంపీపీ పిఎస్ రాజు, మండల టిడిపి మాజీ అధ్యక్షులు ముళ్ళపూడి భాస్కరరావు, మాజీ సర్పంచ్ జల్లికామేశ్వరరావు తదితరులు పాల్గొని తేజను ఆశీర్వదించారు.

సూర్య దినపత్రిక
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు,
మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు ప్రాధాన్యం





**– రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ శిరీష దేవి**
**– ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని రంపచోడవరం శాసనసభ్యురాలు, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీష దేవి అన్నారు. రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యురాలు శిరీష దేవి, పోలవరం ఇన్చార్జ్ జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్, రాష్ట్ర ఎస్టీ కమీషన్ మెంబర్ గొర్లె సునీత, చింతూరు ఏఎస్పి బి.హేమంత్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ దేశంలో మహిళల ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా వివిధ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో మహిళలకు తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తిలో హక్కులు కల్పించిన ఘనత మన ప్రభుత్వానికి దక్కిందన్నారు. అదేవిధంగా మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించిన ఘనత ప్రభుత్వానిదేనని ఆమె అన్నారు. రాష్ట్రంలో మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా రెండు లక్షల రుణాలను ఐదు లక్షల వరకు పెంచడం జరిగిందన్నారు. రాష్ట్రంలో తల్లికి వందనం పథకం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడుకు దక్కిందన్నారు. అర్హులైన మహిళలకు దీపం పథకం ద్వారా సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలవరం జిల్లాలో మినీ అంగన్వాడీలను అంగన్వాడీ కేంద్రాలుగా చేయడం జరుగుతుందన్నారు. గిరిజన మహిళ సంఘాల ద్వారా వెదురు ఉత్పత్తులు తయారు చేసి వాటిని మార్కెట్‌కు పంపడం జరుగుతుందని, అదేవిధంగా పసుపు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగిందని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా పాల ఉత్పత్తులు చేయుటకు గోకులం షెడ్లు, పోలవరం జిల్లాలో వందన్ వికాస కేంద్రాల ద్వారా రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. వందన్ వికాస కేంద్రాల ద్వారా సుమారు వెయ్యి మంది మహిళలు వెదురు ఉత్పత్తులు, కొండ చీపుర్లు, కుంకుడు కాయలు, తేనె, సీకాయ ఉత్పత్తులు ద్వారా అభివృద్ధి జరుగుతుందన్నారు. జాతీయస్థాయిలో మహిళలు బంగారు కుటుంబా లుగా ఎదగాలన్నారు. రాష్ట్ర ఎస్టీ కమీషన్ మెంబర్ గొర్లె సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. మహిళలు పురుషులు కంటే అన్ని రంగాలలో ముందంజలో ఉన్నారన్నారు. మహిళలకు సమాన హక్కులు కల్పించాలని గతంలో అనేక పోరాటాలు చేయడం జరిగిందన్నారు. అనంతరం ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పదిమంది మహిళలకు మహిళా రత్న అవార్డులు, అదేవిధంగా 18 మంది మహిళలకు ఉత్తమ మహిళ పుష్కరాలకు ఎంపికైన వారందరినీ శాలువాలు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లతో సత్కరించడం జరిగింది. జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్ మాట్లాడుతూ ప్రతి మహిళ ఉన్నత చదువు చదివి, మంచి భవిష్యత్ పొందాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజి, డిఎడ్ కాలేజ్ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పోలవరం జిల్లాలో మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా 181.15 కోట్ల రూపాయల చెక్కు, అదేవిధంగా మహిళా సంఘాలు అభివృద్ధికి శ్రీనిధి ద్వారా 38.48 కోట్ల రూపాయల చెక్కును మహిళా సంఘాలకు అందచేయడం జరిగింది. పోలవరం జిల్లాలో నూటికి నూరు శాతం ఇంటి పనులు కట్టించిన పదిమంది విలేజ్ డెవలప్మెంట్ అధికారు లకు సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. అదేవిధంగా జాతీయస్థాయిలో మెడల్స్ సాధించిన బాలికలను సత్కరించడం జరిగింది. అదేవిధంగా ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజర్ రంపచోడవరం వారికి సబ్సిడీతో ఒక ట్రాక్టర్, అదేవిధంగా ఒక బొలెరో వాహనం సబ్సిడీతో మంజూరు చేసి లబ్ధిదారులకు వాహనాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా స్టాల్స్‌ను ముఖ్య అతిథులు పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి సంబంధించిన లైవ్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, ఐటీడీఏ ఏపీవో డి.ఎన్.వి.రమణ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



## జగ్గంపేట సిఐగా తిరుపతిరావు

**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బి.తిరుపతిరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇదే సర్కిల్ పరిధిలోని కిర్లంపూడి గండేపల్లి పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా విధులు నిర్వహించారు ఈ క్రమంలో పదోన్నతి పొంది అదే ప్రాంతానికి సిఐగా రావడం విశేషం. బాధ్యతలు తీసుకున్న తిరుపతిరావును జగ్గంపేట కిర్లంపూడి గండేపల్లి ఎస్సైలు, రఘునాథరావు, శివ నాగబాబు, సతీష్,పోలీసు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# లక్ష్మీపురానికి మంచినీటి సౌకర్యం కల్పించాలి



రంపచోడవరం, మేజర్ న్యూస్ : దేవీపట్నం మండలం లక్ష్మీపురం గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ నాయకులు ఆదివారం డిమాండ్ చేసారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు తక్షణమే స్పందించి మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే లక్ష్మీపురం గ్రామానికి మౌలిక వసతులు తక్షణమే కల్పించాలని కోరారు. ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ పోలవరం జిల్లా దేవీపట్నం మండలం వి.రామన్నపాలెం పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో సుమారు 89 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్ళు అవుతున్నప్పటికీ ఈ గ్రామానికి మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయన్నారు. ఈ గ్రామంలో మూడు చేతి పంపులు ఉన్నప్పటికీ పనిచేయటం లేదన్నారు. గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకం ద్వారా వాటర్ ట్యాంకు నిర్మించి 45 కుటుంబాలకు ఇంటింటికీ కుళాయిలు వేసినప్పటికీ నేటికీ ప్రారంభించలేదన్నారు. అలాగే గ్రామంలో వీధి లైట్లు ఉన్నా వెలగడం లేదన్నారు. ఈ గ్రామంలో వీధిలకూ సిసి రోడ్లు లేవన్నారు. గుంపెనపల్లి వెలగపల్లి గ్రామాల మధ్యలో ఉన్న కాలువకు బ్రిడ్జి నిర్మించి బీటీ రోడ్డు సౌకర్యం లక్ష్మీపురం గ్రామం నుండి కన్నారం గ్రామం వరకు కల్పించి అంబులెన్స్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం వస్తే ప్రజలు హాస్పటల్‌కు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాబట్టి ఈ కాలువకు తక్షణమే బ్రిడ్జి నిర్మించాలని, ప్రస్తుతం లక్ష్మీపురం గ్రామ ప్రజలు 3 మంచినీటి బోర్లు పనిచేయకపోవడంతో మంచినీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులతో అల్లాడుతున్నరన్నారు. ఈ గ్రామాన్ని జిల్లా కలెక్టర్, ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ సందర్శించి తక్షణమే మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు గ్రామానికి మౌలిక వసతులు తక్షణమే కల్పించేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇరప పండు, కోసు బాపనమ్మ, తురస రత్నకుమారి, దొరబాబు పాల్గొన్నారు.

# నారీ శక్తికి నీరాజనం

**– సేవారంగ మహిళా మూర్తులకు లయన్స్ క్లబ్ సన్మానం**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాల్‌లో ఐదుగురు విశిష్ట మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం క్లబ్ అధ్యక్షులు లయన్ సూదా గణపతి అధ్యక్షతన జరిగింది.

సమాజంలోని వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న డా. జొన్నాడ శాంతి ప్రియాంక ఎమర్జెన్సీ డ్యూటీ డాక్టర్, శ్రీనిధి హాస్పిటల్; రెడ్డి సత్య నాగేంద్రమణి మున్సిపల్ చైర్‌పర్సన్, అమలాపురం; మలపర్తి దుర్గాబాయి, టీచర్, సర్ సి.వి.రామన్ స్కూల్; దాసరి అరుణ సర్పంచ్, పేరూరు; కోటిపల్లి మాణిక్యం మున్సిపల్ వర్కర్,అమలాపురం లను ఈ సందర్భంగా దుశ్శాలువలు, పూలమాలలతో గౌరవించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లయన్ సూదా గణపతి మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తూ అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో వారు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఐపీపీ లయన్ రవణం వేణుగోపాలరావు మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తమను గుర్తించి సత్కరించినందుకు సన్మాన గ్రహీతలు లయన్స్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లయన్ బి.వి.హనుమంతరావు, కోశాధికారి లయన్ జి.నాగేశ్వరరావు, సీనియర్ సభ్యులు లయన్ వరదా శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## రత్నంపేట మునిసిపల్ హై స్కూల్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**రామచంద్రాపురం, మేజర్ న్యూస్ :** రామచంద్రపురంలోని రత్నంపేట మునిసిపల్ హైస్కూల్‌లో ప్రధాన ఉపాధ్యాయురాలు ఎన్.శ్రీనివాస పద్మావతి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయినిలను మరియు నాన్ టీచింగ్ స్టాఫ్‌ను ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. పూర్వ కాలంలో స్త్రీలకు చదువుకునే అవకాశం లేదు. కానీ నేడు అందరికీ విద్య అందుబాటులోకి రావడంతో ప్రస్తుత కాలంలో మహిళలందరూ పురుషులతో సమానంగా అన్ని రంగాలలో ధీటుగా రాణిస్తున్నారు అని ప్రధాన ఉపాధ్యాయురాలు పద్మావతి అన్నారు. సమాజంలో ఏదైనా సాధించాలంటే విద్య చాలా అవసరమని కావున ప్రతి ఒక్కరూ శ్రద్ధగా చదవాలని విద్యార్థినీవిద్యార్థులకు సూచించారు. ఇంత ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ను నిర్వహించిన ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు.

## వైభవంగా శ్రీ సత్యదేవుని రథసేవ



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో ఆదివారం శ్రీ స్వామివారి రథ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. వచ్చిన భక్తులు టికెట్ తీసుకుని స్వామివారి రథ సేవలో పాల్గొన్నారు. భక్తులు గ్రామస్తులు రథంతోపాటు రాజగోపురం చుట్టూ ముమ్మారు ప్రదక్షణ నిర్వహించారు. ఈ రథ సేవలో ఆలయ వేద పండితులు, ఆలయ అర్చకులు, అర్చకులు, ఏఈఓ దామోర్ల కృష్ణారావు, ఆలయ సూపర్డెంట్, గణపతి, దేవస్థానం అధికారులు భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు మహాసభల విజయానికి తోడ్పడిన వారందరికీ ధన్యవాదములు





**– కిమ్స్ ఛైర్మెన్ చైతన్య రాజు**

**అమలాపురం, మేజర్ న్యూస్ :** కిమ్స్ ప్రాంగణంలో ఘనంగా జరిగిన 3వ ప్రపంచ తెలుగు మహాసభల విజయానికి తోడ్పడిన వారందరికీ కె.వి.వి.సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) ధన్యవాదములు తెలిపారు.

ఆదివారం నాడు కిమ్స్ ప్రాంగణంలో 3వ ప్రపంచ తెలుగు మహాసభల విజయోత్సవ సభ ఘనంగా జరిగింది. ఫిబ్రవరి 28 వ తేదీ స్థిరవారం మరియు మర్చి 1వ తేదీ ఆదివారం, రెండు రోజుల పాటు అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో 3వ ప్రపంచ తెలుగు మహా సభలు ఘనంగా జరిగాయని, రెండు తెలుగు రాష్ట్రాలనుండే కాక దేశ విదేశాల లోని అనేక మంది తెలుగు వారి నుండి విశేష స్పందన లభించిందని, సుమారు 50 వేల మందికి పైగా హాజరై ఈ సభలను విజయవంతం చేయడం చాలా సంతోషించదగిన విషయమని, ఈ ప్రపంచ తెలుగు మహా సభల నిర్వాహకులు, కిమ్స్ మరియు చైతన్య విద్యా సంస్థల స్థాపకులు మరియు చైర్మన్, మాజీ శాసన మండలి సభ్యులు మరియు గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్ కె.వి.వి. సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ రెండు రోజుల కార్యక్రమాలకు విచ్చేసిన ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా మరియు ఒరిస్సా రాష్ట్రాల గవర్నర్లు, అనేక మంది న్యాయమూర్తులు, కేంద్ర మరియు రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు, పాత్రికేయులు, ఉపాధ్యాయులు, రాష్ట్రం నలుమూలల నుండి కవులు, తెలుగు భాషాభిమానులకు; పోటీలు నిర్వహించుటలో మూడు నెలలపాటు తోడుగా ఉన్న తెలుగు పండితులకు మరియు ముందుండి ఈ కార్యక్రమాలను నిర్వహించిన కిమ్స్ మరియు గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ సిబ్బందికి, ఈ ప్రపంచ మహా సభలను విజయవంతం చేయడంలో భాగస్వాములైన వారందరికీ పేరు పేరునా చైతన్య రాజు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తెలుగు భాషకు పూర్వ వైభవాన్ని కలిగించే ఉద్దేశ్యంతో ప్రారంభించిన ఈ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రతి సంవత్సరం మరింత ఘనంగా నిర్వహించాలని, తద్వారా తెలుగు భాష సంస్కృతీ సాంప్రదాయాలను పరిరక్షించడమే తమ ఆశయం అని ఆయన తెలిపారు. ఈ దిశలో మరింత కృషి చేసే ఉద్దేశ్యంతో "చైతన్య సారస్వత పరిషత్" అనే పేరుతో ఒక సంస్థను స్థాపించామని, రాష్ట్ర మరియు విదేశాల నుండి అనేకమంది ప్రముఖ సాహితీవేత్తలు దానికి సలహాదారులుగా వ్యవహరిస్తారని, వారి సూచనల మేరకు తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడతామని ఆయన తెలిపారు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా భాగస్వాములై సహాయ సహకారాలు అందజేసి తెలుగు మహాసభలను విజయవంతం చేస్తూ తెలుగు భాషాభివృద్ధికి, తెలుగు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు తోడ్పడాలని చైతన్య రాజు కోరారు. వచ్చే సంవత్సరం జనవరి 2వ వారంలో 4వ వార్షిక ప్రపంచ తెలుగు మహాసభలను రాజమహేంద్రవరంలో నిర్వహిస్తామని, విద్యార్థులకు తెలుగు భాషా ప్రావీణ్యతా పోటీలు కూడా నిర్వహించి నగదు పురస్కారాలు ఇస్తామని ఆయన తెలిపారు. ఈ విజయోత్సవ సభలో సుమారు 400 మంది పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

**– శాసనసభ్యులు వనమాడి కొండబాబు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జగన్నాధపురం జే.రామారావుపేట మక్కా మసీద్ కమిటీ వారు ఎంఎం ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కొండబాబు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ రంజాన్ మాసం క్రమశిక్షణ దాతృత్వం మరియు ఆధ్యాత్మిక చింతనకు ప్రతీక అని, కూటమి ప్రభుత్వం ముస్లిం మైనారిటీల అభివృద్ధికి, వారి విద్యా ఉద్యోగ అవకాశాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, మైనారిటీల రక్షణకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రంజాన్ పండుగ ప్రజల మధ్య ప్రేమ, సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తుందని, ముస్లిం మైనారిటీల అభివృద్ధికి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి ఆర్థిక సాధికారతకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ముస్లిం మైనారిటీలంతా ఆరోగ్యం, సుఖశాంతులతో జీవించాలని ఆ అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నానని కొండబాబు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మక్కా మసీద్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఆశ్రిఫ్ ఆలీ, వల్లీ బాషా, మైనారిటీ నాయకులు ఎం.డి.ఖాన్, ఎస్.కె.రహీమ్, ఎం.ఎ.తాజుద్దీన్, ఎం.డి.ఆన్సర్, సయ్యద్ అలీ, అన్వర్, ఇమామ్ సాహెబ్, అయేషా, అర్బన్ భాష, స్థానిక నాయకులు పసగడుగుల శేషగిరిరావు, బొడ్డు శివాజీ, పిర్ల రాంబాబు, మండపాక దుర్గాప్రసాద్, తెప్పల రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం




**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఉత్సవాలలో భాగంగా రంపచోడవరం సిఐ ఎన్.సన్యాసి నాయుడు, ఎస్సై వెంకటరావు, దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ట్రైబల్ వెల్ఫేర్ స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా పోలవరం జిల్లా మహిళా దినోత్సవ ఉత్సవంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో రంపచోడవరం పోలీసులు ప్రత్యేక స్టాల్ ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మహిళల రక్షణకు సంబంధించిన శక్తి యాప్ గురించి, మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చట్టాలు, పోలీస్ సర్వీసెస్, సైబర్ క్రైమ్ గురించి వివరించారు. ప్రత్యేకమైన పోస్టర్లు, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ స్టాల్ ను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, రంపచోడవరం ఇంచార్జ్ ఎస్‌డిపిఓ బి.హేమంత్ సందర్శించడం జరిగింది.

# శ్రీ స్వామివారి దేవస్థానం పునర్నిర్మాణ 14వ వార్షికోత్సవం

**– మార్చి 10న ఘనంగా**

**లక్ష పత్రి పూజ మరియు సన్మాన కార్యక్రమం**



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ స్వామివారి దేవస్థానం పునర్నిర్మాణం జరిగి 14 వసంతాలు పూర్తవుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, ఈ నెల మార్చి 10వ తేదీ (మంగళవారం) నాడు ఆలయ ప్రాంగణంలో "వార్షిక ఉత్సవము" అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫాల్గుణ బహుళ సప్తమి పర్వదినం సందర్భంగా మంగళవారం ఉదయం నుంచే ఆలయంలో విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయి.

లక్ష పత్రి పూజ: ఉదయం గం. 10:00 లకు ప్రధానాలయము నందు వేంచేసియున్న మూలవరులకు శాస్త్రోక్తంగా "లక్ష పత్రి పూజ" నిర్వహించబడుతుంది.

విశేష సేవలు: స్వామివారికి ప్రత్యేక నివేదనలు, నీరాజన మంత్రపుష్పములు మరియు వేద పండితులచే మంత్రోచ్చారణలతో కూడిన వైదిక క్రతువులు నిర్వహించబడతాయి.

వైదిక కమిటీ సభ్యులకు గౌరవ సత్కారం:ఆలయ పునఃప్రతిష్టా సమయంలో విశేష సేవలందించి, ప్రస్తుతం పదవీ విరమణ పొందిన వైదిక కమిటీ సభ్యులను ఈ వేడుకకు గౌరవపూర్వకంగా ఆహ్వానించడమైనది. స్వామివారి సేవలో వారు అందించిన అంకితభావానికి గుర్తింపుగా, ఈ వార్షికోత్సవ వేదికపై వారిని ఘనంగా సత్కరించడం జరుగుతుందని నిర్వాహకులు వెల్లడించారు.దైవచింతనతో జరిగే ఈ వార్షిక మహోత్సవంలో గ్రామస్తులు, పరిసర ప్రాంతాల భక్తులు మరియు స్వామివారి సేవకులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించి ఆ సత్యదేవుని కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కోరడమైనది. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వారు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

# మహిళా భద్రత సమాజ భద్రతకు మూలస్తంభం





**– జిల్లా ఎస్‌పి రాహుల్ మీనా**

**అమలాపురం, మేజర్ న్యూస్ :** మహిళా భద్రత సమాజ భద్రతకు మూల స్తంభం అని మహిళా అభివృద్ధి దేశ అభివృద్ధికి కొలమానమని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రాహుల్ మీనా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక కలెక్టరేట్ నుండి గడియారపు స్తంభం వరకు నిర్వహించిన బైక్ ర్యాలీని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఆయన కలెక్టరేట్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం గడియారపు స్తంభం వద్ద మానవహారంగా ఏర్పడి "సమానత్వం మహిళా సాధికారత హక్కులు" అనే ఇతివృత్తంతో బెలూన్లు ఎగరవేసి మహిళా దినోత్సవ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, తమదైన శైలిలో ముద్ర వేసి మహిళలు తమలోని శక్తిని గుర్తించి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని అప్పుడే ఆశించిన సమానత్వ సమాజాన్ని నిర్మించగలమన్నారు. సాంస్కృతిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను గుర్తించడంతో పాటు దేశ భవిష్యత్తును రూపొందించడం కీలకమైన వారి పాత్ర గురించి తెలియజేయడం ఈ రోజు ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక ఇతివృత్తంతో జరుపుకుంటారని, ఈ 2026కు సంబంధించి మహిళా సాధికారత, సమానత్వం, నాయకత్వంపై దృష్టి సారించి చేపట్టారన్నారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడానికి ఈసారి ప్రత్యేక థీమ్ ద్వారా ఒకరికి ఒకరు సహాయం చేస్తే, అందరికీ ప్రయోజనం చేకూరి సమాజంలో పురోగతి సాధ్యమయ్యేలా ఈ దినోత్సవం నిర్వహించారన్నారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి కే.నాగమణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డి.రాంబాబు, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీశక్తి పథకం సూపర్ సక్సెస్ కాబడి మైలురాయిగా నిలిచింది

**- ఎమ్మెల్యే ఆనందరావు**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేస్తే, ఆ పథకాల అమల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం స్త్రీశక్తి పథకం సూపర్ సక్సెస్ కాబడి మైలురాయిగా నిలిచిందని స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఆదివారం స్థానిక సత్యనారాయణ గార్డెన్ నందు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారిక మహిళల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. సెర్ప్, మెప్మా, మహిళా శిశు సంక్షేమ శాఖలతో పాటు వివిధ కార్పొరేషన్ల ద్వారా మహిళలు ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదిగేలా ఎన్నో పథకాలను, కార్యక్రమాలను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత మొదలుకుని వారి ఆర్థిక స్వావలంబన వరకు చాలా కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కీలకమైన పథకాల్లో మహిళలను భాగస్వాము లను చేసి మహిళలకే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో తల్లికి వందనం, స్త్రీశక్తి వంటి పథకాలు మహిళ కోసం రూపొందించినవేనన్నారు. నేడు అన్ని రంగాల్లోనూ ముందున్న మహిళలు తమ అద్భుత తెలివి ఆలోచించే విధానంతో రోజురోజుకి పురోగతి సాధిస్తున్నారన్నారు. సమాజ ప్రగతిలో భాగస్వాములైన మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ప్రతీ మహిళా పారిశ్రామిక వేత్త కావాలన్న ముఖ్యమంత్రి ఆకాంక్షకు అనుగుణంగా 2026-27 ఆర్థిక ఏడాదిలో ఐదు లక్షల మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింద న్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.925 కోట్లు; స్త్రీ నిధి ద్వారా రూ 278 కోట్లు; సిఐఎఫ్ ద్వారా రూ.5 కోట్లు;ప్రధానమంత్రి ఉపాధి కల్పన ద్వారా రూ.5 కోట్లు; పిఎమ్ఎఫ్ఇ ద్వారా రూ.2 కోట్లు; పిఎంఏజేఏవై ద్వారా రూ.3 కోట్లు; ఉమెన్ లెండింగ్ ఎంట ర్ప్రైజెస్ ద్వారా రూ.67 కోట్లు వెరసి ఈ ఆర్థిక సంవత్స రంలో ఇచ్చిన లబ్ది రూ.1,289 కోట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డిపిఎంలు అన్నపూర్ణ, గణపతి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేసిన కూటమి నాయకులు



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామంలో పాత పంపు హౌస్ నుండి (చెరుకులంక పుంత) కోటిపల్లి రోడ్డు వరకు సుమారు 900 మీటర్ల పైబడి 80 లక్షల నిధులతో సిమెంటు రోడ్డుకు కూటమి నాయకులు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించడం జరిగింది. ఈ సంద ర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ ఈ రహదారికి నిధులు ఇచ్చిన రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మరియు కూటమి నాయకులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గ్రామ కమిటీ అధ్యక్షులు పితాని తేజ, ఎం పీటీసీ నెంబర్లు వాసంశెట్టి త్రిమూర్తులు, పితాని వెంకట రాము, లోవా, మడ్డు శ్రీను, మరియు కరప జనసేన మండల అధ్య క్షులు,నీటి సంగంప్రెసిడెంట్ గోవిందురాజులు పాల్గొన్నారు.

## ప్రతీ మహిళ సంపూర్ణ ఆరోగ్యంతో, ఆర్థికంగా ఎదగాలి

**- డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ప్రతీ మహిళ సంపూర్ణ ఆరోగ్యంతో, ఆర్థికంగా ఎదగాలని డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) తెలిపారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఎపిఎం పుప్పాల సూర్యనారాయణ, సిడిపిఓ జి.ఉష, మెప్మా సిఎంఎం జి.భ్రమరాంబల పర్యవేక్షణలో నియోజకవర్గ స్థాయి మహిళా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పాల్గొని మాట్లాడుతూ మహిళ అమ్మగా, అత్తగా, అక్కగా, చెల్లిగా, భార్యగా అన్ని పాత్రలు పోషిస్తూ తనకంటూ సమాజంలో ఒక ప్రత్యేకతను చాటుకుంటుందని, మహిళ పాత్ర ఎంతో విలువైనదని, ఆయన పేర్కొంటూ, అలాగే మహిళలు విద్య, వైద్యతో పాటు అన్ని రంగాలలో ముందుం డాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెంకే వెంకటలక్ష్మి, ఎఎంసి ఛైర్మన్ నూనె మంగతాయారు, అందుగుల జార్జ్ మనికుమారిలు మహిళలనుద్దేశించి సమాజంలో మహిళల పాత్రపై వివరించారు.ఈ కార్యక్రమంలో పెద్దాపురం నియోజకవర్గంలోని పట్టణ, గ్రామాలకు చెందిన పలువురు మహిళా కౌన్సిలర్లు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, డ్వాక్రా సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లతో పాటు మండల పరిషత్ కార్యాలయ ఏఓ సత్యనారాయణమూర్తి, డిప్యూటి ఎంపిడిఓ జి.వి.శేఖరరెడ్డి, కార్యాలయ సిబ్బంది, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వైజ్ సిబిఓ సంస్థ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో గల వైజ్ సిబిఓ సంస్థ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం వైజ్ పిడి జయ అధ్యక్షురాలు మల్లీశ్వరి, ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మణరావుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎపి ఎస్ఎసిఎస్ అధ్యక్షులు రామానాయుడు పాల్గొని మాట్లాడుతూ మహిళలు నేటి సమాజంలో అన్ని రంగాలలో ముందుంటున్నారని, ఆర్థికంగా, విద్యాపరంగా మరింత అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు.

అలాగే ప్రతీ ఒక్క మహిళ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుని ఆరోగ్యవంతమైన కుటుంబం, సమాజం కోసం కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైజ్ సిబిఓ సంస్థ సభ్యులు, సిబ్బంది జార్జ్ ముల్లర్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శక్తి... పోలీస్ శక్తి

**- మహిళా దినోత్సవం పురస్కరించుకుని**

**- ఎస్సై మౌనికను సన్మానించిన జిల్లా కలెక్టర్ మరియు ఎస్.పి.**





**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పోలీస్ శాఖలో ధైర్య సాహసాలు చూపిస్తూ, మహిళల, శాంతి భద్రతలకు అండగా నిలుస్తూ, శాంతి భద్రతల పరిరక్షణలో ముందుండి విధి నిర్వహణలో సేవలందిస్తూ తన కంటూ ఒక ప్రత్యేకత చాటుకున్న పెద్దాపురం ఎస్సై మౌనికను కాకినాడ జిల్లా కలెక్టర్ షాగలి షన్మోహన్, జిల్లా ఎస్.పి. జి.బిందుమాధవ్‌లు మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆమెను అభినందించి సన్మానించారు. దీనిలో భాగంగా ఇటీవల సామర్లకోట మండలం, వేట్లపాలెంలో జరిగిన బాణాసంచా ప్రమాదంలో క్షతగాత్రులకు సేవలంది ంచడంలో ముందుండి ఎస్సై మౌనిక తన సేవలను అందిస్తూ బాధితులకు అండగా నిలిచారని జిల్లా కలెక్టర్ షాగలి షన్మోహన్, జిల్లా ఎస్.పి. జి.బిందుమాధవ్‌లు ప్రశంసించడం ఎంతో అభినందనీయం. అనంతరం పెద్దాపురం నియోజకవర్గ, పట్టణంలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సిబ్బంది ఎస్సై మౌనికను అభినందించినవారిలో ఉన్నారు.

# ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయాలి

**- సివిల్ సర్వీసెస్ డైరెక్టర్ శ్రీరామ్**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను సక్రమంగా అమలు చేయాలని సివిల్ సర్వీసెస్ (ముస్సోరి) డైరెక్టర్ శ్రీరామ్ తరణి కంటి పేర్కొన్నారు. రంపచోడవరం ఐటిడిఏ కార్యాలయం పరిశీలనకు ఆదివారం వచ్చిన శ్రీరామ్ తరణి కంటి ని జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్, రంపచోడవరం ఇన్చార్జ్ ఎస్‌డిపిఓ హేమంత్, ఐటీడీఏ ఏపీవో జనరల్ డి.ఎన్.వి. రమణ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. నూతన ఏర్పడిన పోలవరం జిల్లాలో ఎన్ని మండలాలు, ఎన్ని డివిజన్లు, ఎన్ని గ్రామాలు ఉన్నది, జిల్లా విస్తరణ, రోడ్డు మార్గాలు ఏవిధంగా ఉన్నది వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఈ జిల్లాలో ఎంతమంది గిరిజనులు ఉన్నది, జిల్లాలో పారిశుధ్య కార్యక్రమాలు ఏ విధంగా నిర్వహిస్తున్నది, అదేవిధంగా కలెక్టర్ కార్యాలయం, జిల్లా పోలీస్ కార్యాలయం ఎక్కడ ఏర్పాటు చేసింది, జిల్లాలో ఎన్ని పోలీస్ స్టేషన్లు ఉన్నది ఆయన ఆరా తీశారు. ఈ ప్రాంతంలో గిరిజనులు ముఖ్యమైన పంటలు ఏం పండించుచున్నది ఆయన ఆరా తీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు అర్హులైనవారికి సక్రమంగా అందుతున్నది, లేనిది చర్చించడం జరిగింది. అదేవిధంగా



పోలవరం జాతీయ ప్రాజెక్టుకు సంబంధించి మ్యాప్, అదేవిధంగా పోలవరం కొత్త జిల్లా మ్యాప్‌ను డైరెక్టర్ పరిశీలించడం జరిగింది. అనంతరం పిజిఆర్ఎస్ కు వచ్చిన దరఖాస్తుదారుల నుండి దరఖాస్తులు ఏ విధంగా స్వీకరిస్తున్నది ఆయన తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏవో ఎర్రంశెట్టి రాజు, మేనేజర్ బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం

**- పాల్గొన్న భక్తులు**



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసా దం స్వీకరించారు. వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి. శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్ర ప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ పాల్గొన్నారు.

# సమానత్వ సాధనకై పోరాడాలి

**– సిఐటియు జిల్లా కమిటి సభ్యురాలు తలారి నాగమణి**




**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** శ్రమ దోపిడి సామాజిక అణచివేత, లింగ వివక్షతలకు వ్యతిరేకంగా పోరాడవలసిన కర్తవ్యం మనందరిపై ఉందని, సిఐటియు జిల్లా కమిటి సభ్యురాలు తలారి నాగమణి పేర్కొన్నారు. ఆదివారం యాసలపు సూర్యారావు భవనంలో అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు టి.ఎల్.పద్మ అధ్యక్షతన సిఐటియు – ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1910 నుండి మహిళా దినోత్సవం జరుపుకుంటున్న ఆ ఒక్క రోజు మాత్రమే మహిళలుకు గౌరవం ఇస్తున్నట్లు నటిస్తూ మిగిలిన అన్ని రోజులు మహిళలపై అణచివేతకు గురి చేస్తున్నారని, సమాన అవకాశాలు ఎన్ని ఉన్నా రెండవ తరగతి పౌరులుగానే మహిళలను చూస్తున్నారని, శ్రమదోపిడి జరుగుతుందని, పనిలో లైంగిక వేధింపులు జరుగుతున్నా వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవని వారు ఆవేదన వ్యక్తం చేసారు. మద్యం గంజాయి మత్తులో యువత నిర్వీర్యం అవుతుందని, వాటిని అరికట్టవలసిన బాధ్యత ప్రభుత్వాలుపై ఉన్న మిన్నకుంటున్నాయని, సభలు, సన్మానాల కన్నా మహిళలకు కనీస గౌరవం ఇవ్వాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐద్వా కార్యదర్శి వరలక్ష్మీ, సుబ్బలక్ష్మీ, పిసిసి అధ్యక్షురాలు కూనిరెడ్డి అరుణ, అంగన్‌వాడీ నాయకులు స్నేహలత, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు లోవకుమారి ప్రసంగించారు. సిఐటియు నాయకులు క్రాంతికుమార్, ఎస్.శ్రీనివాస్, ప్రజానాట్యమండలి కార్యదర్శి రొంగల వీర్రాజు, చంటి, భాను, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

## జడ్డంగిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పోలీసులు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు




**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని జడ్డంగి స్టేషన్ పరిధిలో ఎస్ఐ చిన్నబాబు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందిని సత్కరించి వారి సేవలను ప్రశంసించారు. మహిళల సాధికారతకు వారు చేస్తున్న కృషిని అభినందిస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మహిళా సాధికారత (ఉమెన్ ఎంపవర్మెంట్ ) అంశంపై విద్యార్థులలో అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన వ్యాసరచన (ఎస్సైయ్ రైటింగ్ ) మరియు వక్తృత్వ (ఎలాక్యూషన్ ) పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. పాఠశాలలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని పెన్నులు మరియు ప్యాడ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులను బాగా చదివి మంచి మార్కులు సాధించి తమ తల్లిదండ్రులు, గురువులు మరియు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. మహిళల సాధికారతకు అందరూ కలిసి సహకరించాలని ఈ సందర్భంగా ఎస్ఐ చినబాబు కోరారు.

## తీపర్రు గ్రంథాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు



**పెరవలి, మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తీపర్రు శాఖా గ్రంథాలయంలో మార్చి 8వ తేదీ ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ రిసోర్స్ పర్సన్ మిరియాల ప్రియాంక ను గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గ్రంధి శ్రీరామచంద్రరావు సాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నేటి కాలంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు ధీటుగా ముందుకు సాగుతూ తమ ప్రతిభను నిరూపిస్తున్నారని, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథపాలకురాలు సిహెచ్ వి జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన అనేక మంది మహిళలు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటి నుంచి ఒక మహిళ పారిశ్రామికవేత్తగా తయారవ్వాలి

**– జ్యోతుల**

**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** ప్రతి ఇంటి నుంచి ఒక మహిళ పారిశ్రామికవేత్తగా తయారు చేయడమే చంద్రబాబు లక్ష్యమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఆదివారం స్థానిక పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ లు హాజరయ్యారు. ముందుగా జ్యోతులనెహ్రూ సతీమణి నెహ్రూ ఫౌండేషన్ చైర్మన్ జ్యోతుల మణి, మహిళా మణులు జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రార్థన గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ జ్యోతుల మణి తో పాటు వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ ఘనపరిచిన 30 మంది మహిళలను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు. అమరావతిలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకలలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్న సమావేశాన్ని ప్రత్యక్ష ప్రసారంలో ఎమ్మెల్యే తో పాటు మహిళా మణులు అందరూ తిలకించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ మహిళల అభివృద్ధి, సాధికారతకు కూటమి ప్రభుత్వం




కట్టుబడి ఉందని ఎమ్మెల్యే నెహ్రూ పేర్కొన్నారు. మహిళలు విద్యతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. మహిళలకు తగిన అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో ప్రతిభ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మల్లిన రామచంద్రరావు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం

**– ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్**



**పెరవలి, మేజర్ న్యూస్ :** మల్లిన రామచంద్రరావు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని మంచి తనానికి ఆదర్శప్రాయమైన వ్యక్తి అని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. మార్చి 8వ తేదీ ఆదివారం తణుకులో స్వర్గీయ మల్లిన రామచంద్రరావు ఇంటి వద్ద నిర్వహించిన సంస్మరణ సభలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ రామచంద్రరావు సమాజం పట్ల ఎంతో బాధ్యతతో వ్యవహరించేవారని పేర్కొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో అందరినీ భాగస్వాములను చేస్తూ ప్రజల్లో సేవా భావాన్ని పెంపొందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. పట్టుదల, ధైర్యం, ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తిత్వం కలిగిన మల్లిన రామచంద్రరావు అనేక మంది పారిశ్రామికవేత్తలకు ఆదర్శంగా నిలిచారని ఆయన అన్నారు. మాజీ ఎమ్మెల్యే మల్లపూడి వెంకటకృష్ణారావు మాట్లాడుతూ మల్లిన రామచంద్రరావు రాజకీయాల్లో కూడా విలక్షణమైన పాత్ర పోషించారని తెలిపారు. తొలి రోజుల్లో తణుకు శాసనసభ్యులుగా గన్నమని సత్యనారాయణమూర్తిను స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి నిలబెట్టి ఆయన విజయం సాధించడంలో మల్లిన కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా గత స్మృతులను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, రాజకీయ ప్రముఖులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ముక్కామల గ్రంథాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం



**పెరవలి, మేజర్ న్యూస్ :** మార్చి 8వ తేదీ ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పెరవలి మండలం ముక్కామల గ్రామంలో శ్రీ ఇనపకోళ్ళ రాఘవరావు మెమోరియల్ శాఖ గ్రంథాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి ఎంతో సేవలు అందిస్తున్న గ్రంథాలయ రిసోర్స్ పర్సన్ శ్రీమతి ఎన్. పుష్పవతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యక్షులు సలాది వీర వెంకట సూర్యనారాయణ, సభ్యులు కరటూరి విశ్వనాథం, ఎం. సత్యం, కొంపెల్ల పట్టాభిరామం, పి.వెంకటేశ్వర్లు, బాబ్జి, కరటూరి కామేశ్వరరావు పాల్గొన్నారు. అలాగ చదువరులు, విద్యార్థులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరటూరి విశ్వనాథం మాట్లాడుతూ మహిళలు భూమి నుంచి ఆకాశం వరకు ప్రతి రంగంలోనూ తమ ప్రతిభను చాటుకుంటూ విజయాలను సాధిస్తున్నారని అన్నారు. మహిళల విజయాల వెనుక పురుషుల సహాయ సహకారాలు కూడా ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి ఎం. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు

**– హెల్పింగ్ హాండ్స్ సభ్యులు సహకారంతో**



**దేవరపల్లి, మేజర్ న్యూస్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళ సమవేశంలో హెల్పింగ్ హాండ్స్ శ్రీ బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎర్నగూడెం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని దేవరపల్లి మండలం కృష్ణం పాలెం గ్రామం కండవల్లి శిరీష ఇంటి వద్ద మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య నిర్ణయం తీసుకోగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు 70% రాయితీలో స్కూల్ యూనిఫామ్లు లను కుట్టుకోలు ఆర్థిక సహాయాన్ని అందించాలని మహిళలు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ సొసైటీ అధ్యక్షులు ఆధ్వర్యంలో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రెటరీ తిరుపతి, ప్రసాదు, గ్రేసీ, శివకుమారి, ఇందిరా, మెంటే మురళీకృష్ణ, చంద్రశేఖర్, వెంకన్న, పెద్దిరాజు, గన్ని రాజు, ట్రైనర్ దుర్గ భవాని, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాకినాడ జిల్లా స్థాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవం





**– పాల్గొన్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎస్పీ బిందు మాధవ్, ఎమ్మెల్సీ పద్మశ్రీ, ఎమ్మెల్యే కొండబాబు**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆదివారం స్థానిక కుళాయి చెరువు పార్కు వద్ద గల కళాక్షేత్రం మీటింగ్ హాల్‌లో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ, సేర్ఫ్, మెప్మా శాఖల సౌజన్యంతో జిల్లా స్థాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ పట్టణ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసారు. అనంతరం జిల్లాలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తూ స్ఫూర్తిగా నిలిచిన మహిళలను ప్రశంసా పత్రాలు మెమొంటోలను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి చేసిన ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను అందిపుచ్చుకోవాలన్నారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బిందు మాధవ్ మాట్లాడుతూ.. కుటుంబాలను పోషించుకుంటూ వ్యాపార రంగాల్లో రాణిస్తున్న మహిళలు ఎంతో స్ఫూర్తిని, సానుకూల దృక్పథాన్ని అందిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు బాలికలు కేవలం పదవ తరగతి, ఇంటర్మీడియట్ వరకు పరిమితం చేయకుండా ఉన్నత చదువులు చదివించేందుకు చక్కటి ప్రోత్సాహం అందించాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సూచించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ.. ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు తమ హక్కులు పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ.. వివిధ వ్యాపార రంగాల్లో రాణిస్తున్న మహిళలందరూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందించుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన మహిళలు స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేయగా, విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామీణ, పట్టణ మహిళా స్వయం సహాయక, సంఘాలకు ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా భారీ స్థాయిలో రుణాల చెక్కులను పంపిణీ చేశారు. కాకినాడ జిల్లాలో1.36 లక్షల మంది మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.17.36 కోట్లు; 2,827 మంది పట్టణ మహిళా సంఘాల సభ్యులకు రూ.434.62 కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కులను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే కొండబాబు తదితరుల చేతుల మీదుగా మహిళల సంఘాల సభ్యులకు అందజేశారు. అదేవిధంగా జిల్లా మహిళా శిశు సంక్షేమం శాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో టాపర్స్ కు రూ. 8.25 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.ఈ వేడుకల్లో డీఆర్డీఏ పీడీ జి.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ సీహెచ్.లక్ష్మి, పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్ గణపతి, సెట్రాజ్ సీఈవో కాశీవిశ్వేశ్వర రావు, డీసీపీవో వెంకటరావు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో ఇంటి పన్నులు చెల్లించండి



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు గ్రామంలో ఆదివారం ఎంపీడీఓ హేమంత్ రాజు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. ఇంటి పన్నులు మరియు కుళాయి పన్నుల చెల్లింపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. సకాలంలో పన్నులు చెల్లించడం ద్వారా గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. గ్రామంలోని మంచినీటి సరఫరా మరియు పారిశుధ్య పరిస్థితులపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పన్నుల వసూలు ప్రక్రియను ఆయన స్వయంగా పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ విద్యాసాగర్, సచివాలయ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**– మంత్రి కందుల దుర్గేష్**

**– రాష్ట్ర మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం కల్పించిన అవకాశంతో మహిళా శక్తిగా ఎదిగిన ప్రతి ఒక్క మహిళకు, రాష్ట్రంలోని మహిళలందరికీ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు, గుంటూరు జిల్లా ఇంచార్జి మంత్రి కందుల దుర్గేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అమరావతి రాజధానిలోని పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు అనిత, సవిత, గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్ కుమార్ మరియు ఇతర ప్రజా ప్రతినిధులు, గుంటూరు జిల్లా కలెక్టర్ అన్సారియాలతో కలిసి పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్ మహిళా శక్తిని కొనియాడారు. అంతకు ముందు సభా ప్రాంగణానికి విచ్చేసిన సీఎం చంద్రబాబు నాయుడుకు మంత్రి దుర్గేష్ ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా మహిళా సాధికారత శక్తిని పెంచే విధంగా నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నేడు నవ్యాంధ్రప్రదేశ్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషిని వివరించారు. రాష్ట్రంలోని మహిళలందరూ తమ కాళ్ళ మీద తమ నిలబడేలా సీఎం చంద్రబాబు నాయుడు ప్రణాళికలు రూపొందించారని తెలిపారు..మహిళలకు వెన్నుదన్ను గా నిలిచిన నాయకులు సీఎం చంద్రబాబు నాయుడు అని అభివర్ణించారు. సెర్ప్, డ్వాక్రా సంఘాల్లోని సభ్యులకు ప్రభుత్వం ఇచ్చిన రుణాలతో ఎంట్రపెన్యూర్ లుగా ఎదిగిన మహిళల ఆడియో–వీడియో ప్రదర్శనను మంత్రి దుర్గేష్ ఆసక్తిగా తిలకించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో ఒక మహిళా పారిశ్రామికవేత్త ఉండాలన్నది సీఎం చంద్ర బాబు నాయుడు ఆశయం. 2024–25లో ఇప్పటికే లక్ష మంది మహిళలను పారిశ్రామి కవేత్తలుగా తీర్చిదిద్దాం. 2026–27 నాటికి ఈ సంఖ్యను 5 లక్షలకు చేర్చడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. వచ్చే ఎన్నికల నాటికి సగం మంది మహిళలు రాజకీయ పదవులను పొందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చారిత్రాత్మక చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథంలో వేగంగా దూసుకుపోతోందని మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

# పిఠాపురంలో ఘనంగా మహిళా దినోత్సవం వేడుకలు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం పట్టణం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనం నందు మహిళా సమైక్య విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. జనసేన పిఠాపురం పై మాన్ కమిటీ సభ్యులు డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు, మాజీ శాసనసభ్యులు పెండెం దొరబాబు, ఒదురి కిషోర్ సమక్షంలో పిఠాపురం ఎండిఓ స్వప్న మరియు సిడిపిఓ చేతుల మీదుగా కేక్‌ను కట్ చేశారు.

ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి బాబు మాట్లాడుతూ... మహిళా దినోత్సవ సందర్భంగా పిఠాపురం శాసనసభ్యులు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తరపున పిఠాపురం ఆడపడుచులు అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళ ఈ దేశానికీ ఒక శక్తీల తయారు అవ్వాలని, మహిళలందరూ పౌష్టికాహారం తీసుకుని మీ ఆరోగ్యం పై శ్రద్ధ చూపించాలని తెలియజేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని ఆలోచనతో మహిళలకు డ్వాక్రా సంఘాల ద్వారా స్వయం ఉపాధి పథకాలు తీసుకురావడం జరిగిందన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో 350 కోట్లతో అభివృద్ధి పనులు చేయడం జరిగిందని పిఠాపురం నియోజకవర్గంలో ఎక్కడ చూసినా సిసి రోడ్లు మరియు పారిశుధ్యం నిరంతరం ప్రక్రియల కొనసాగుతుందని తెలియజేశారు. అనంతరం విధినిర్వహణలో తమ అత్యుత్తమ సేవా కనబరిచిన మహిళలకు సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పడా పిడి బి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ కనకారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉమ్మడి అమలేశ్వరి, కాకినాడ జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాల (ఎ) లో మార్చి 8వ తేదీ 'అంతర్జాతీమహిళా దినోత్సవం' సందర్భంగా వేడుకలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ మహిళా శక్తిని అందరికీ తెలియపరచి, తాము ఎందులోను పురుషుల కంటే తక్కువ కాదుఅనితెలియజేసినఎందరో మహిళామణులను ప్రసంశించి, సత్కరించేరోజు ఇదిఅని ఆయన అన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ తాను ఒకమహిళాకళాశాల ప్రిన్సిపాల్‌గా భాధ్యతలు నిర్వహించడం ఆనందదాయకమనీ, సమాజంలో ఎందరో మహిళామణులు వివిధ వృత్తులలో తమ నైపుణ్యాలను కనపరుస్తుండటం సమాజంలో చూస్తూన్నామని అన్నారు. సందర్భంగాకళాశాలలో ఎన్.ఎస్.ఎస్. విద్యార్థినీలకు పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలిచిన విద్యార్థినీలకు ప్రథమ ద్వితీయ బహుమతులు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ చేతులమీదుగా అందజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ ఎమ్. శ్రీనివాస్, అసిస్టెంట్ కె.నవ్య మరియు అధిక సంఖ్యలో ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.